క్లుప్తంగా

'కంచి గరుడ సేవ' పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ అధికారి

నగరి: పట్టణంలోని టీటీడీ అనుబంధ శ్రీ కరియమాణిక్యస్వామి ఆలయంలో ఈ నెల 13న మంగళవారం నిర్వహించనున్న కంచి గరుడ సేవ ఉత్సవాన్ని సంబంధించి పోస్టర్లను గురువారం ఆలయ అధికారి వెంకటరమణ ఆవిష్కరించారు. స్థానిక భక్తుల సహకారంతో వీటిని ముద్రించినట్లు ఆయన చెప్పారు. కంచిసేవకు ఈఓ, జేఈఓ, డిప్యూటీ ఈఓ, ఏఈఓ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ధన్వంతరాచార్యులు, నరసింహ ప్రసాద్, వేదపారాయణ పండితులు రామ్‌ప్రసాద్, ఆలయ అభివృద్ధి సలహా సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కదిలిన అధికార యంత్రాంగం



రెడ్డేపల్లి నీటి ట్యాంకును పరిశీలిస్తున్న అధికారులు

గంగాధర నెల్లూరు: మండల అధికార యంత్రాంగం స్పందించింది. మండలంలోని రెడ్డేపల్లి గ్రామంలో కూటమి ప్రభుత్వం నేతలు నీటి ట్యాంకు పారిశుద్ధ్య పనులను అడ్డుకోవడంతో ట్యాంకు పాచి పట్టి పురుగులు వస్తుండడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం సాక్షి దినపత్రికలో 'కలుషిత నీటితో ఆవేదన' పేరిట ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. వాటర్ ట్యాంకును పరిశీలించి శుభ్రం చేసేందుకు సత్వర చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లిల్లీ కుమారి, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే ఉన్నత విద్య



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం

పాలసముద్రం : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తున్నామని వెంగళరాజుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చక్రధర్‌రావు తెలిపారు. గురువారం వీర్లగుడి, కన్నికాపురం, మహదేవపురం గ్రామాల్లో ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్న తల్లిదండ్రులకు ఆయనే మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, పౌష్టికాహారంలో కూడిన మధ్యాహ్న భోజనం ప్రభుత్వం అందిస్తుందన్నారు. అందువల్ల ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి డబ్బులు వృథా చేయకుండా ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైరోడ్డు అభివృద్ధి ప్లాన్ ప్రచురణ



ప్లాన్‌ను చూపుతున్న కమిషనర్, ఏసీపీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో హైరోడ్డును విస్తరించి అభివృద్ధి చేయడంపై అధికారులు రూపొందించిన ప్లాన్‌ను గురువారం ప్రచురించారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ నరసింహ ప్రసాద్ ఏసీపీ నాగేంద్ర నూతన ప్లాన్‌ను ప్రచురించారు. తిరుపతి రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి వివేకానంద విగ్రహం పక్కన ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జ్ వరకు 1.1 కిలో మీటర్ల దూరం వరకు రూపొందిన ప్లాన్‌లో భవన యజమానులకు ఏవైనా సందేహాలు ఉంటే ఈనెల 23వ తేదీలోపు కార్పొరేషన్ అధికారులకు రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ శుభప్రద, బిల్డింగ్ సూపర్‌వైజర్ బాలాజీ, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థికి అవార్డు

పూతలపట్టు(కాణిపాకం): పదో తరగతిలో ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో రాష్ట్రస్థాయి ఆరో ర్యాంకుకు సాధించిన పూతలపట్టులోని సంజీవరాయపల్లి గురుకుల పాఠశాల విద్యార్థి మోహన కృష్ణ(585)కు మంత్రులు బాల వీరాంజనేయ, సంధ్యారాణి అవార్డు అందజేశారు. విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రులు ఆ విద్యార్థికి అవార్డు ప్రదానం చేశారు. అలాగే రాష్ట్రస్థాయిలో స్కూల్ వందశాతం ఉత్తీర్ణత సాధించినందుకు ప్రిన్సిపల్ కోటేశ్వరరావు మంత్రుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. తమ విద్యార్థి మోహన్‌కృష్ణ రాష్ట్ర స్థాయిలో అవార్డు సాధించడంపై ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

కబళిస్తున్న రంగు నీరు!

తమిళనాడు డైయింగ్ యూనిట్ల నిర్వాహకుల ఆర్థిక బలం, అధికార పార్టీ ఆదేశాలతో మూసివున్న డైయింగ్ యూనిట్ల గేట్లు తెరచుకున్నాయి. పరవళ్లు తొక్కుతూ హానికర రసాయన రంగునీరు కాలువల్లో ప్రవహించడం మొదలుపెట్టింది. ఆ నీరు ప్రజారోగ్యాన్ని కబళిస్తోంది.

- మున్సిపల్ అధికారులకు పట్టని ప్రజారోగ్యం
- ఇప్పటికే రోజుకో రంగులో తాగునీటి సరఫరా
- అయినా సరే..డైయింగ్ యూనిట్లకు పచ్చజెండా ఊపిన అధికారులు!



నగరి ఏకేఎన్ లేఔట్‌లోని కాలువల్లో పారుతున్న రసాయన రంగునీరు



సత్రవాడలో పైపుల ద్వారా కాలువల్లో వదులుతున్న రసాయన రంగునీరు

నగరి : మున్సిపాలిటీలో నీటి ముప్పు కొనసాగుతోంది. ప్రజారోగ్యానికి చేటు కలిగిస్తున్నాయని మున్సిపల్ అధికారులు డైయింగ్ యూనిట్లను మూసివేయడం విదితమే. అయితే ఆపై డైయింగ్ యూనిట్ల యజమానులు మూసిన డైయింగ్ యూనిట్లలో స్వంతంగా ఈటీపీ ఉన్న యూనిట్లన్నీ తెరచుకున్నాయి. మున్సిపల్ కాలువల్లో మురుగుతో పాటు హానికర రసాయనాలు కూడా కలిసి ప్రవహిస్తోంది. దీంతో పారిశుధ్య వ్యవస్థ గాడి తప్పింది. ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది.

ప్రారంభించిన యూనిట్లను పర్యవేక్షించేదెవరు?

తమ వద్ద ఈటీపీ ప్లాంటు ఉందని తాము శుద్ధీకరించి ఆ నీటినే వాడుకుంటామని, లేనిపక్షంలో ఎవాపరేట్ చేస్తామంటూ డైయింగ్ యూనిట్ల నిర్వాహకులు ఇచ్చిన హామీలతో ఆ యూనిట్లు ప్రారంభమయ్యాయి. యూనిట్ల నిర్వహణ ఆపే అధికారం తమకు లేదని, మురుగునీటి కాలువల్లో హానికర రసాయన రంగునీరు వస్తే మాత్రం తప్పకుండా చర్యలు తీసుకుంటామనా మున్సిపల్ అధికారులు ప్రకటించినా ఆచరణలో చేతులెత్తేశారు. ప్లాంటు ప్రారంభమైన నాటి నుంచే మురుగు కాలువల్లో రసాయన రంగునీరు ప్రవహిస్తోంది. దీంతో యూనిట్లు నిబంధనల మేరకు వ్యవహరిస్తున్నాయా? లేదా? అనే అంశాల పర్యవేక్షణ గాలికొదిలేశారు.

కౌన్సిలర్ల పోరాటం బూడిదలో పోసిన పన్నీరేనా?

డైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే నీటి వల్ల ప్రజారోగ్యం దెబ్బతింటోందని వాటిని జనావాసాల నుంచి దూరపు ప్రాంతాలకు తరలించాలంటూ నాలుగు సమావేశాల్లో కౌన్సిలర్లు పోరాటం చేశారు. మున్సిపల్ సమావేశంలో అజెండా ఆమోదించక బయటకు వచ్చి పోరాటం చేశారు. ఇంత జరుగుతున్నా తమిళనాడు డైయింగ్ యూనిట్ల ఆర్థిక బలం ముందు కౌన్సిలర్ల పోరాటం బూడిదలో పోసిన పన్నీరైంది.

తమిళనాడు చర్యలు ఇక్కడ తీసుకోరా?

తమిళనాడు తిరుపూర్ డైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే రసాయన నీటి కారణంగా ఆ ప్రాంతంలోని నోయల్ నది కలుషితం కావడంతో మద్రాసు హైకోర్టు 2011 జనవరి నెలలో తిరుపూర్‌లోని డైయింగ్ యూనిట్లను నిషేధిస్తూ తీర్పునిచ్చింది. దీంతో అక్కడి డైయింగ్ యూనిట్లు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లాయి. అలా నగరి మున్సిపాలిటీలో పనిలేక మూసివున్న డైయింగ్ యూనిట్లను అద్దెకు తీసుకొని వారి పని ఇక్కడ మొదలు పెట్టారు. ఇక్కడి కుశస్థలి నదిని పూర్తిగా కలుషితం చేశారు. అక్కడ నిషేధం ఇక్కడ ఆమోదం ఎలా అవుతుందంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కలెక్టర్‌కు నివేదించిన సీపీఐ నేతలు

హానికర రసాయనాలు విడుదల చేస్తున్న డైయింగ్ యూనిట్లను నివాస ప్రాంతాలకు దూరంగా తరలించాలని, ప్రజారోగ్యాన్ని రక్షించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జిల్లా కలెక్టర్‌కు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. అన్ని ప్లాంట్లు మూసివేసి అందులో కొన్నింటిని తెరవడం, కొన్నింటిని మూసివేయడం పలు సందేహాలకు తావిస్తోందని అన్నింటినీ మూసివేసి దూరప్రాంతాలకు తరలించాలని కోరారు.

ప్రాణాంతక వ్యాధుల్లో తలసేమియా ఒకటి

నగరి : ప్రాణాంతక వ్యాధుల్లో తలసేమియా ఒకటని డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్ అన్నారు. గురువారం ప్రపంచ తలసేమియా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో పోలీసులు రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన పలువురు పోలీసులకు డీఎస్పీ సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. తలసేమియా వంశపారపర్యంగా తల్లి, తండ్రి నుంచి పిల్లలకు సంక్రమించే జన్యుపరమైన రక్త రుగ్మతన్నారు. ఈ వ్యాధికి గురైన వారిలో శరీరంలో ఉండాల్సిన హిమోగ్లోబిన్ స్థాయి కన్నా తక్కువస్థాయి హిమోగ్లోబిన్ ఉంటుందని, దీంతో ఎముకల సాంద్రత తగ్గి రోగి బలహీనంగా తయారవుతారన్నారు. ఈ వ్యాధి లక్షణాలు, చికిత్సా విధానం గురించి ప్రజలకు సరైన అవగాహన లేదని, అందుకే దీనిపై అవగాహన పెంచేందుకు ప్రతి ఏటా మే 8న ప్రపంచ తలసేమియా దినోత్సం నిర్వహిస్తున్నారన్నారు. ఈ వ్యాధితో చనిపోయినవారికి నివాళులు అర్పించడం, వ్యాధిపై అవగాహన కల్పించడం ప్రపంచవ్యాప్తంగా చేస్తారన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు, సీఐ విక్రమ్, ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పోలీసులు

కల్యాణం..కమనీయం



అశ్వ వాహనంపై ఊరేగుతున్న శివపార్వతులు

పుత్తూరు: పట్టణంలోని ప్రముఖ శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం భక్త జన సందడి నడుమ కనుల పండువగా సాగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి 7 గంటలకు వేద పండితులు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు పల్లకి సేవ నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి, అశ్వ వాహనంపై కొలువు దీర్చారు. రాత్రి 8 గంటలకు అశ్వవాహనంపై శివపార్వతులు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇంటింటా కర్పూరహారతులిచ్చారు. పల్లకి సేవకు మాడా శ్రీనివాసులు, అశ్వ వాహన సేవకు కేసీ.సత్యనారాయణ, కేసీ మధుబాబు ఉభయదారులుగా వ్యవహరించారు.

రాష్ట్రస్థాయి ర్యాంకర్లకు కలెక్టర్ అభినందన



ప్రజ్వలను అభినందిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



నక్షత్రను అభినందిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన పీఎస్ఎన్ శ్రీ వివేకానంద కళాశాల విద్యార్థినులను కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ శభాష్ అని అభినందించారు. జిల్లా కేంద్రంలోని మురుగానపల్లి లో ఉన్న పీఎస్ఎన్ శ్రీవివేకానంద కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. గురువారం ఆ విద్యార్థినులకు కలెక్టరేట్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో చిత్తూరు విద్యార్థిని ప్రజ్వల 470 మార్కులకు 468 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చిందన్నారు. ద్వితీయ సంవత్సరంలోనూ ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అలాగే ఎంపీసీ చదువుతున్న నక్షత్ర 470కి 467 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. కరస్పాండెంట్ పి.సత్యనారాయణ మాట్లాడుతూ తమ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మొదటి రెండు ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు. ఏప్రిల్ 12వ తేదీన ప్రకటించిన ఫలితాల్లో మొదటి సంవత్సరం చదువుతున్న ప్రజ్వలకు 470కి 462, నక్షత్రకు 463 మార్కులు వచ్చాయన్నారు. ఆ ఇద్దరు విద్యార్థినులు ఇంగ్లిష్ సబ్జెక్టులో బాగా సమాధానాలు రాసినప్పటికీ మార్కులు తగ్గాయనే సందేహంతో రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. రీ వెరిఫికేషన్ ఫలితాలు రావడంతో ప్రజ్వలకు ఇంగ్లిష్ సబ్జెక్టులో 93 మార్కుల నుంచి 98, నక్షత్రకు 95 నుంచి 99 మార్కులకు పెరిగాయని తెలిపారు. దీంతో ప్రజ్వలకు 470 మార్కులకు 468, నక్షత్రకు 467 మార్కులు వచ్చాయన్నారు. జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా తమ కళాశాలలో చదివిన ప్రజ్వల ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు సాధించడం గర్వంగా ఉందని తెలిపారు. అనంతరం ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువతో కలెక్టర్ సత్కరించారు. ప్రిన్సిపల్ నాగరాజ శెట్టి, ప్రజ్వల తల్లిదండ్రులు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి, సంగీత, నక్షత్ర తల్లిదండ్రులు సుధాకర్‌రెడ్డి, లీలావతి పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్



రైల్వేస్టేషన్‌లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



మాక్‌డ్రిల్‌లో భాగంగా ప్రయాణికుల తరలింపు



బాంబు గుర్తింపు, సహాయక చర్యలు

చిత్తూరు కార్పొరేషన్: భారత్–పాక్ దేశాల మధ్య ఉద్రికత్తల వేళ జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు చిత్తూరు రైల్వేస్టేషన్‌లో పోలీసులు ప్రయాణికుల సహకారంతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. గురువారం రైల్వేస్టేషన్‌లో ఉగ్రవాదులు బాంబు పెడితే ప్రయాణికులను ఎలా అప్రమత్తం చేయాలి ? అనే అంశంపై కార్యక్రమం నిర్వహించామని పోలీసులు తెలిపారు. రైల్వేస్టేషన్‌లోకి చొరబడిన ఉగ్రవాదులను పట్టుకోవడం, గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయాలను అందించడం.. బాంబు పేలుడు, క్షతగాత్రుల తరలింపు, బాంబు, డాగ్ స్క్వాడ్‌ల ద్వారా బాంబును గుర్తించి వాటి కనెక్షన్‌ను సురక్షితంగా తొలగించడం తదితర అంశాలను కళ్లకు కట్టినట్లు చేసి చూపించారు. ఉగ్రవాదులు దాడులకు పాల్పడితే స్టేషన్‌లో ప్రయాణికులు ఎక్కడికక్కడే నిలబడకుండా నేలపై పడుకోవాలని, లైట్లు ఆపివేయాలని, మొబైల్, టార్చ్ లైట్ వేయరాదన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ శివానందకిషోర్, డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, సీఐలు మహేశ్వర, నెట్టికంఠయ్య, ఆర్పీఎఫ్ సీఐ కుమార్, సహాయ ఫైర్ ఆఫీసర్ కరుణాకర్, ఎంహెచ్ఓ లోకేష్, రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ట్రాన్స్‌కో డీఈ ప్రసాద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ వ్యవసాయ విధానాలపై అవగాహన



గుడిపాలలో..

తవణంపల్లె: రైతులకు డిజిటల్ వ్యవసాయ విధానాలపై అవగాహన అవసరమని వ్యవసాయాధికారి జి. ప్రవీణ్, భారతి తెలిపారు. మండలంలోని వెంగంపల్లె, టి.పుత్తూరు రైతుసేవా కేంద్రాల్లో గురువారం రైతులకు మూడవ స్థాయిలో వ్యవసాయశాఖ ద్వారా స్కిల్ యాప్ చిత్తూరు–డిజిటల్ ట్రైనింగ్ వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులకు స్మార్ట్‌ఫోన్ల వినియోగం గురించి వివరించారు. అదే విధంగా వ్యవసాయంలో డిజిటల్ చెల్లింపులు ఎలా చేయాలనే అంశాలపై తెలిపారు. వ్యవససాయంలో యూట్యూబ్ పాత్ర, ప్రాముఖ్యత, వ్యవసాయ సంబంధిత యూట్యూబ్ చానళ్ల ఉపయోగాలు, నష్టాలు, మైక్ పాత్ర గురించి వివరించారు. వ్యవసాయ రంగంలో పశువుల పాత్ర గురించి తెలిపారు. వ్యవసాయ యాప్‌లను రైతులు అవగాహనతో వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి లేష్మ, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్ దీపిక, రైతులు పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులు అవలంభించి అధిక ఆదాయం పొందాలని మండల పర్యవేక్షక అధికారి తులసిరామ్ సూచించారు. గురువారం మండలంలోని ఎర్రేపల్లె రైతు సేవా కేంద్రంలో స్థానిక రైతులకు చిత్తూరు స్కిల్ యాప్ డిజిటల్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఆనంద్‌రాజ్, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: రైతులు వ్యవసాయ సాంకేతికతపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి మాధవి అన్నారు. గురువారం బొమ్మసముద్రంలో రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానిటరింగ్ ఆఫీసర్ సుధాకర్‌యాదవ్, మాస్టర్ ట్రైనర్ నదీమ్, సెరికల్చర్ అసిస్టెంట్ ప్రమీలలు పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: పంటల సాగులో రైతులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని ఏఓ చిట్టిబాబు అన్నారు. మండలంలోని గుంతూరు రైతు సేవా కేంద్రలో గురువారం స్కిల్ ఆఫ్ చిత్తూరు డిజిటల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ ప్రకాష్‌నాయుడు, విస్తరణాధికారి సాదరయ్య, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.